# ఈ 'కట్టెను' కట్టెలా కాల్చక మానవు

భానుడు నగ్నప్రచండుడై అవని గుండెలమీద హత్తుకుపోయి ముద్దెట్టుకుంటే భరించరాని వేడి...

భూగోళాన్ని కొలిమిలోంచి తీసినట్టుగా మండిపోయే ఎర్రటి ఎండ... ధూళి కణాలుకూడా వేడెక్కి వడగాల్పులు వీస్తున్నాయి.

నాలుక పిడచకట్టుకుపోయే ఎండ.... సోడా సీసాల గొంతు పిసికి కిస్‌స్‌మనే శబ్దాల గిరాకీని పెంచే ఎండ...

అంతటి ఎండలో అటు పట్టణానికి... పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోవున్న సాగర్ కాలనీకి మధ్య చిన్నవాగు వంతెనకింద.... పిచ్చిది పొర్లుతోంది! కడుపులోని బిడ్డ కాళ్ళతో తన్నుతుంటే పిచ్చిది హృదయవిదారకంగా అరుస్తోంది. ఆ వాగులో నీరు వానాకాలంలోనే ఎండిపోయింది. కాలుతోన్న ఇసుక పిచ్చిదాని శరీరంమీద బొబ్బలు లేపుతోంది.

"హ...హ...హ....అమ్.... మా...మా" జుత్తు పీక్కుంటూ ఏడుస్తోంది. ఆ ఏడ్పు స్మశానంలో ప్రేతాత్మ పకిలించినట్లుగా వుంది. గుడ్డల్ని పేలికలు చేసింది. నడుమును మెలికలు తిప్పుతూ నగ్నంగా పొర్లుతుంటే వేడెక్కిన ఇసుక దాని శరీరాన్ని భగభగ మండిస్తోంది. 'పెనం'మీద పొంగుతోన్న రొట్టెలా బాధతో పడుం విదుస్తోంది.

ఒళ్ళంతా మట్టిని పూసుకుంది... సమాధిలా పొడుచుకొచ్చిన 'గర్భం' మీద బొగ్గుగీతలు గీసింది. పురావస్తు త్రవ్వకాల్లో బయటపడ్డ శిలాశాసనంగా దానికడుపు....

లోకం చేసిన పాపాన్ని పొత్తికడుపులో దాచుకొన్న శిశువుని ఆర్తిగా నిమురుతుంటే ఏమనుకుందో శిశువు... చిన్నారి కాళ్ళతో కడుపులోనే ఈడ్చి తన్నితే భయంకరమైన అరుపు...

భయం భయంగా కడుపువైపు చూసుకుంది. మరోసారి నొప్పి.... భరించలేక నడుంని పట్టుకొని మల్లెతీగలా మెలికలు తిరిగింది. అలా మొదలై... రెండుగంటల్నుంచి కడుపులోని పాపతో పోరాడుతోంది ఎర్రటి ఎండలో!

భూమిని గోళ్ళతో త్రవ్వింది.

కసిగా ఇసుకను బుక్కింది.... జుత్తు పీక్కుంది. కడుపుమీద పిడిగుద్దులు గుద్దుకుంది. దాని గాజుకళ్ళలోంచి జలపాతమైన కన్నీళ్ళు.

హృదయ విదారకరమైన ఆ పోరాటంలో పోరి పోరి అలసి పోయింది. శిశువు బయటకు రాలేదు. కాని గుండెల్లోని ప్రాణాలు మాత్రం బయటికి వెళ్ళిపోయాయి

ఆ వంతెనకింద... నిర్జీవంగా పిచ్చిది!

రెండుగంటలు గడిచాయి. పొడుచుకొచ్చిన పొత్తికడుపుమీద ఒక రాబందువు గోళ్ళతో రక్కిపోయింది. ముక్కుతో పొడిచింది. తమ సైన్యాన్ని పిల్చుకురావడానికి పై పైకి ఎగిరిపోయింది.

చిల్లుపడిన పిచ్చిదాని కడుపులోంచి చిన్నారిచేయి బయటికి పొడుచుకొచ్చింది.... భయంకరంగా!!

* * *

"సార్... పిచ్చిది చచ్చిపోయింది" కానిస్టేబుల్ కనకారావు ఎస్సయి రంగనాయకులుతో వినయంగా చెప్పాడు.

ఫైళ్ళలోంచి తలెత్తి జాలిగా చూసాడు రంగనాయకులు. బాల్ పెన్

క్యాప్‌తో క్రింద పెదవిమీద రాసుకుంటూ 'ఎక్కడ' అన్నాడు. అతడి కనుబొమ్మలు చిత్రంగా ఎగిరిపడ్డాయి.

"చిన్నవాగు వంతెన కింద...."

రంగనాయకులు మౌనంలో పడ్డాడు. జీపులో వెళుతుంటే రోజూ ఎదురయ్యేది. ఎంత హారన్‌కొట్టినా ప్రక్కకు జరిగేది కాదు. ఎక్కడెక్కడో తిరిగేది. ఒక్కోసారి అడవిలో రైడింగ్స్‌కి వెళ్ళినపుడు చీకట్లో కన్పించి హడలగొట్టేది.

పొడుగ్గా పెరిగిన ఉంపిరిజుత్తు... సగం చిరిగిన చీర నడుముకి చుట్టబడి వుండేది. జబ్బలపై చిరిగిన 'రవిక'ను మరింత చింపుకుంటూ కన్పించేది. ఎర్రగా, బొద్దుగా వుంటూ ఏ రోడ్డు ప్రక్కన చూసినా పిచ్చిదే...

దాని గురించి రకరకాల కథలు చెప్పుకుంటారు. 'పండ్లబండి' వాళ్ళదగ్గర గంటల తరబడి నిలబడేది. ఎవరైనా ఒకఅరటిపండు ఇస్తే వెళ్ళిపోయేది. ఒక్క దీపావళి రోజుమాత్రం కన్పించక పోయేది. మర్నాడు కొత్త చీరతో, కొత్త జాకెట్‌తో రోడ్డుమీద సాక్షాత్కరించేది. అయితే ఎవరా చీరె కట్టబెట్టారన్నది మాత్రం అంతు చిక్కని ప్రశ్నగానే వుండిపోయింది.

బహుశా ఈ వూర్లోనే తల్లి దండ్రులున్నా బయటపడక పోవచ్చు అనుకున్నాడు రంగనాయకులు. అలాంటి పిచ్చిదానికి కడుపయింది. దాని రూపం గుర్తొచ్చి ఎస్సైయిగారి ఖాకీవొళ్ళు సన్నగా జలదరించింది. ఆ వూహే భయానకం అన్నట్టుగా కుడిచేత్తో నొసటిని రుద్దుకొంటూ.... "పిచ్చిది ప్రసవించిందా?" అన్నట్టు నిట్టూరుస్తూ.

"లేదెస్సార్.... ప్రసవించలేదు. టెటానస్ వచ్చిందేమో!" అన్నాడు కనకారావు.

"శవం అక్కడే వుందా?"

"అవున్సార్"

కథా నిలయం
శ్రీకాకుళం

"మనమేం చేద్దాం? ఇది మున్సిపాలిటీ అయితే వాళ్ళు చూసుకునే వారు. వూర్లో నాయకుడు చచ్చినా పిచ్చిది చచ్చినా మనకేబాధ" అన్నాడు ఫైలు టేబిల్ పైపడేస్తూ.

"మనమే ఏదైనా చెయ్యటం మంచిదిసార్"

"అవసరే. ఖర్చులెవడు భరించాలి? పైసలురాని కేసులు పట్టడ మెందుకు" అంటూ దీర్ఘంగా ఆలోచించాడు. అయిదు నిముషాల తర్వాత ఎస్సయిగారి మొహం ట్యూబ్ లైట్ లా వెలిగింది.

"కనకం ..." అన్నాడు ప్రేమగా.

"ఎస్సార్" ఆ ప్రేమకు పొంగిపోయి మరోసారి సెల్యూట్ చేశాడు కనకారావు.

"ఎక్కడ చచ్చింది?"

"చిన్నవాగు వంతెనకింద సార్."

"శవం ఏ దిక్కున వుంది? ఆ ఒడ్డుకా... ఈ వొడ్డుకా?"

"ఇవతలి ఒడ్డుకే వుంది సార్... ఎందుకుసార్?"

"అయితే కనకం! నువ్వూ మరో కానిస్టేబుల్ వెళ్ళి ఎవరూ చూడక ముందు ఆ శవాన్ని అవతలి ఒడ్డుకు పడెయ్యండి."

కనకారావుకి అర్థమైంది. అయ్యగారి తెలివికి మనసులోనే సెల్యూట్ కొట్టాడు.

"ఇప్పుడు వెళ్ళమంటారా సార్"

"ఇప్పుడు వద్దు. చీకటిపడ్డాక వెళ్ళండి. ఈ లోపుగా ఎవరైనా వానిగురించి మన స్టేషనులో కంప్లయింట్ ఇస్తే పట్టించుకోకండి" అని బూట్లు టకటకలాడిస్తూ వెళ్ళిపోయాడు.

ఆ పట్టణంలో వన్ టౌనూ... సాగర్ కాలనీలో టూ టౌన్ వుంది. ఈ రెండిటిమధ్య చిన్న వాగుంది. ఇవతలి ఒడ్డు వన్ టౌన్ పరిధి లోకి పోతుంది.

అదీ సంగతి!!!

* * *

సాగర్ కాలనీ.... టూ టౌన్.

"సార్ — మన స్టేషన్ పరిధిలో చిన్న వాగువంతెన కింద ఒక పిచ్చిదాని శవం పడివుంది" అన్నాడు వరాలు ఎస్సయి గారితో.

"నిన్న జరిగిన హత్యతోనే వారం రోజులవరకూ తెగని బిజీగా వుంటుంది. నీయమ్మ.. ఇప్పుడిదో కేసా.... నాలుగు పైసల్ దొరికేదన్నా కాదు...." కసురుకున్నాడు ఎస్సైయి.

"పాపం.... ప్రెగ్నెంట్ సార్" పోలీసు మొహంలో ఖాకీరకపు జాలి!

"ఎట్లా చచ్చిందిరా లంజె..."

"ఏమోసార్! మనగండానికి చచ్చింది ముండ. ఏం చేద్దాం సార్?" అంతలో ఫోన్ రింగయింది. ఎస్సయి ఎత్తాడు.

"హలో సార్.... ఎస్సార్... ఓకే సార్ ఆ వచ్చేస్తున్నా సార్" అని ఫోన్ పెట్టేసి "ఎస్.పి.గారు ఫోన్ చేసారు. ఎవడో మంత్రి వచ్చి కూచున్నాట్ట. నేను వెళ్తున్నాను. పిచ్చిదాన్ని ఆ ఒడ్డుకు పడెయ్యండి. వన్ టౌన్ పరిధిలోకి వచ్చేటట్లు...." అనేసి అతివేగంగా వెళ్ళిపోయాడు.

పిచ్చిదాని శవం ఇవతలి ఒడ్డుకు చేర్చబడింది. ఈడ్చుకొచ్చి పడేసిన పోలీసులు చేతులు దులుపుకొని వెళ్ళిపోయారు.

అర్ధరాత్రి.... బీటు కానిస్టేబిల్‌గా తిరుగుతున్న కనకారావు పిచ్చిదాని శవాన్ని తమ వన్‌టౌన్ పరిధిలో చూసి అవాక్కయ్యాడు.

"అమ్మ నా కొడకల్లారా...." అనుకున్నాడు. మసక వెన్నెల్లో పిచ్చిది. దాని కడుపులోంచి పొడుచుకొచ్చిన చెయ్యి భయంకరదృశ్యంగా కన్పించింది. ఓసారి మనసులో ఆంజనేయ దండకం చదువుకొని తిరిగి అవతలి వొడ్డుకు బరబరా ఈడ్చుకుపోయాడు.

ఆ రాత్రి పిచ్చిది మళ్ళీ టూటౌన్ స్టేషన్ పరిధిలో పడింది. రెండు గంటల రాత్రి శవం మళ్ళీ నడిచింది. తెలతెలవారుతుండగా... ఫోను మ్రోగటంతో ఎస్సయి రంగనాయకులు ఫోనెత్తాడు.

"హల్లో...."

"హలో సార్.... అయాం చీఫ్ రిపోర్టర్ ఫ్రం ఉదయకిరణం డెయిలీ"

"చెప్పండి సార్. ఏంకావాలి?"

"మీ స్టేషన్ పరిధిలో ఓ పిచ్చిదాని శవం నిన్నటినుంచి పడివుంది మీకు తెలీదా?" రంగనాయకులు మొదట కలవరపడి "నో సార్... మాకు తెలీదు. థ్యాంకూ వెరీమచ్. ఇప్పుడే మా కానిస్టేబుల్ని పంపిస్తాను" అనేసి టక్కున ఫోన్ పెట్టేసాడు.

"కనకారావ్"

సీరియస్‌గా పిలవటంతో జైలర్లు సైతం ఉలిక్కిపడ్డాడు. విషయం తెల్సిన కనకారావు వణికిపోయి "నిన్ననే ఆ వొడ్డుకి రెండుసార్లు చేర్చాను సార్" అన్నాడు దీనంగా. గుడ్లురిమి చూసి "నేను జర్నలిస్టుగాడికి ఫోను చేసేలోగా పిచ్చిదాని శవం అవతలివొడ్డున వుండాలి" అన్నాడు.

ఇద్దరు కానిస్టేబుల్లు వేగంగా బయటికి వెళ్ళిపోయారు. పదినిమిషాల తర్వాత ఫోనెత్తి

"జర్నలిస్ట్‌గారూ... ఆ శవం మా ఒన్‌టౌన్ పరిధిలో లేదండి. సారీ" అన్నాడు. అప్పుడే వాసన పడుతోన్న పిచ్చిదాని శవంమీద కాకులు కానిస్టేబుల్లని చూసి చెల్లాచెదురయ్యాయి.

* * *

మర్నాడు తొమ్మిదీ గంటలకు...

రంగనాయకులు అకస్మికంగా ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. వాన రాకడ... ప్రాణంపోకడ ఎలాగో పోలీసు డిపార్టుమెంట్‌లో ట్రాన్స్‌ఫర్‌లూ అలాగే.

మరో గంట తర్వాత ఖమ్మంనించి క్రొత్త ఎస్సయిగారొచ్చి జాయినయ్యాడు. మొదటి అపాయింట్‌మెంట్. యువకుడు హేండ్సమ్‌గా

వున్నాడు ఖాకీవనంలో తులసి మొక్కలా! అతనిపేరు సాయికృష్ణ. కానిస్టేబుల్లు పరిచయమయ్యాక తన సీట్లో కూచున్నాడు.

ముఖంమీద గర్వం తొణికిసలాడింది.

గంజితో మెరసిపోతున్న ఖాకీబట్టల్ని చూసుకుంటూ తల్లితండ్రుల్ని గుర్తుచేసుకొని తృప్తిగా నవ్వుకున్నాడు సాయికృష్ణ.

అప్పుడే ఒక వ్యక్తి లోపలికివచ్చి

"సార్! చిన్నవాగు వొడ్డున ఓ పిచ్చిది నిన్న చచ్చిపోయింది. అర్ధ రాత్రి ఆ శవం ఆ ఒడ్డుకీ, ఈ ఒడ్డుకీ తిరుగుతోందని జనం జాతర మొద లెట్టారు అప్పుడే. దాని శవం మీ స్టేషన్ పరిధిలోనే వుందిప్పుడు. జనాలు గుడికట్టి పూజలు చేయకముందే ఆ శవాన్ని మీరు ఖననం చేయడం మంచిదేమో" అన్నాడు.

"ఈ ఉద్యోగంలో మొదటికేసు ఒక పిచ్చిదానిశవం..." అను కున్నాడు సాయికృష్ణ.

గుర్తు తెలియని శవంగా కేసు బుక్ చేస్తాం. సరే కాని ఖననం చెయ్యాలనే రూల్స్ మాకేమీ లేవు. అయినా మా సాయం మేం చేస్తాం పదండి. కానిస్టేబుల్స్... ఫాలోమీ" అన్నాడు.

చిన్నవాగు దగ్గర పోలీసు జీపుల్ని చూసి జనం తప్పుకున్నారు. గుండెల్ని కదిలించే స్థితిలో పిచ్చిదాని వికృతశవం పడివుంది. సాయికృష్ణ తన జేబులోంచి రెండువందల రూపాయల్ని కట్టెలకోసం పంపాడు. శవం కుళ్ళిపోయి వాసనవేస్తోంది. కాకులు రాబందులు శవాన్ని తూట్లు తూట్లుగా పొడిచాయి.

చితి పేర్చబడింది!

నలుగురు పోలీసులు కట్టెలా బిగుసుకుపోయిన శవాన్ని చితిపైకి చేర్చారు. మిగతా కట్టెలు కప్పారు. కిరోసిన్ చల్లాక "కనకారావ్... నిప్పంటించేసి వచ్చేయ్" అంటూ జీప్‌వైపు కదిలాడు సాయికృష్ణ.

కనకారావ్ నిప్పుని వెలిగిస్తుంటే చితి మధ్యలో పిచ్చిదాని పొత్తి కడుపుని చీల్చుకొచ్చిన చెయ్యి ఏదో చెప్తున్నట్టుగా కన్పించింది. కడుపులో దేవినట్లయి కళ్ళముందు గత స్మృతులేవో కదలాడాయి.

ఎనిమిది నెలలకింద... ఆ రాత్రి వర్షంలో తడిసి స్టేషన్ గోడకి వోరగా నిల్చున్న పిచ్చిదాని అందాలకి మైకంలో వున్న కానిస్టేబుళ్ళు మూకుమ్మడిగా అత్యాచారం జరిపిన దృశ్యం రంగుల్లో కదలాడుతుంటే.... కనకారావు కళ్ళు మూసుకొని నిప్పంటించాడు.

ఆ రాత్రి చర్యలో భాగం పంచుకున్న తనని తెలియని పాశమేదో వెంటాడి ఋణం తీర్చుకున్నట్లు ఫీలయి వెనుదిరిగాడు కనకారావ్.

ఉవ్వెత్తున మంటలు లేచాయి.

ఆ "కట్టె"ను కట్టెలు కాల్చేస్తుంటే ఆ మంటల్లోంచి చిన్నారి చేయి ఆకాశాన్ని మరింత ఎత్తుకు లేపుతున్నట్లు ఎదిగిపోతూనే వుంది. ★